
పిఠాపురం కాలనీ, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైపు మలుపు తిరిగే రోడ్డు


మద్దిలపాలెం సిగ్నల్ రోడ్డులో విస్తరణ పనులు

ట్రాఫిక్ నియంత్రణ లక్ష్యంగా..

- మద్దిలపాలెం కూడలి విస్తరణ
- చురుగ్గా గురుద్వారా వైపు పనులు

మద్దిలపాలెం : ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రధాన కూడళ్లతో పాటు రద్దీ రహదారులను విస్తరణకు శ్రీకారం చుట్టారు. నగరంలో ప్రధాన కూడలిలో ఒకటైన మద్దిలపాలెం వద్ద రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కూడలి వద్ద విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ కష్టాలకు తెర పడనుంది. నాలుగు రోడ్ల కూడలి కావడంతో అన్ని వైపుల నుంచి వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ కూడలిని విస్తరించాలని అప్పటి సీపీ త్రివిక్రమవర్మ సూచించారు. ఈ మేరకు విస్తరణ పనులు ప్రారంభించారు.

- మద్దిలపాలెం నుంచి గురుద్వారా వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ ఐలాండ్ వద్ద రోడ్డు డివైడర్ల ఎక్కువ విస్తర్ణంలో ఉండేవి. దీంతో వాహనాలు సిగ్నల్ వద్ద నిలిచే క్రమంలో చాలా దూరం వరకూ వాహనాలు బారులు తీరుతుండేవి. దీంతో ఈ డివైడర్లను చాలా వరకూ కుదించి రోడ్డు విస్తరించారు. దీంతో సిగ్నల్ వద్ద రోడ్డు వెడల్పు పెరిగింది.
- గురుద్వారా వైపు తెలుగుతల్లి విగ్రహం వద్ద ఇలానే ఎక్కువ విస్తీర్ణంలో డివైడర్ ఉండేది. దీన్ని చాలా వరకూ తొలగించి రోడ్డు విస్తరణ చేశారు. దీంతో సిగ్నల్ వద్ద చాలా వెడల్పుగా రోడ్డు తయారైంది.
- ఆర్టీసీ కాంప్లెక్, రామాటాకీస్ వైపు నుంచి వచ్చే వాహనదారులు ఇటు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైపు వెళ్లడానికి సిగ్నల్ వద్ద ఉండే డివైడర్లను వెడల్పును కూడా తగ్గించారు. దీంతో పాటు యూటర్న్ తీసుకునే వద్ద కూడా డివైడర్‌ను కుదించారు. ఇప్పుడు ఎంతో విశాలంగా రోడ్డు రూపుదిద్దుకుంది. చాలా వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి.


గురుద్వారా వైపు వెళ్లే మార్గంలో విస్తరించిన రోడ్డు

కూడలిలో ఎక్కువగా ఖాళీ వదిలేసిన ప్రాంతాన్ని రోడ్డుగా విస్తరించారు. ఈ పనులు చాలా వరకూ పూర్తి కావస్తున్నాయి. రోడ్డు విస్తరణ కావడంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా విశాలాక్షినగర్ రోడ్డు విస్తరణ

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి నుంచి కైలాసగిరి కూడలి వరకు ప్రధాన రహదారి విస్తరణ పనులకు ఇటీవల శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇది బీచ్ రోడ్డుతో పాటు పర్యాటక కేంద్రమైన కై లాసగిరికి వెళ్లే రహదారి కావడంతో జీవీఎంసీ దీన్ని విస్తరిస్తోంది. ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ రోడ్డును మరింత విస్తరించి ట్రాఫిక్ సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ రోడ్డు కొన్ని చోట్ల 60 అడుగులు, మరికొన్ని చోట్ల 30 అడుగులు వెడల్పు ఉంది. ఇప్పుడు దీన్ని హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ కూడలి వరకు 80 అడుగులకు విస్తరిస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు పక్కన తవ్వకాలు చేపడుతున్నారు.


విశాలాక్షినగర్‌లో జరుగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులు

జగనన్న పాలనతో రాష్ట్రంలో మార్పు

- విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


కార్యక్రమంలో భాగంగా చంటిబిడ్డను ముద్దాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనతో ఏపీలో మార్పు మొదలైందని, ఈ నాలుగేళ్లలో రాష్ట్ర గణనీయమైన ప్రగతి సాధించిందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 19వ వార్డులోని జాలరిపేటలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సురాడ వెంకటలక్ష్మితో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ కార్యక్రమాలు నెరవేర్చారన్నారు. పేదల అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. రానున్న రోజుల్లో ఇదే ఒరవడిని కొనసాగించడానికి ప్రజలందరి సహకారం అవసరమన్నారు. వార్డు స్థాయిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా జగనన్న సురక్ష సర్వే


ఆరిలోవ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో ఓ ఇంటి యజమానికి బీపీ చెక్ చేస్తున్న ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు


ఇసుకతోట యూపీహెచ్‌సీ పరిధిలో ఓ గృహిణికి బీపీ చెక్ చేస్తున్న ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు

ఆరిలోవ/మద్దిలపాలెం: తూర్పు నియోజకవర్గంలో జగనన్న సురక్ష సర్వే జోరుగా సాగుతోంది. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. నియోజకవర్గంలో వార్డుల్లో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జీవీఎంసీ 9, 13, 16వ వార్డుల్లో జగనన్న సురక్ష సర్వే చేపట్టారు. జ్వరం, బీపీ, మధుమేహం తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందించారు. అవసరాలు తెలుసుకుని ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేయడం, మందులు ఇవ్వడం గతంలో ఎప్పుడూ జరగలేదని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దూరంగా ఉన్న ఆస్పత్రులకు వెళ్లి వైద్యుల వద్ద క్యూలో గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సౌకర్యాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గంలో ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సీఎంకు వినతి


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వినతిపత్రం అందిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

ఏయూ క్యాంపస్: పలు అభివృద్ధి పనులు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. సోమవారం అసెంబ్లీలో సమావేశాలకు హాజరైన సీఎంను వంశీకృష్ణ కలిసి ఈ మేరకు విన్నవించుకున్నారు. విశాఖ నగర పరిధిలోని 21వ వార్డులో శ్రీకన కమ్మ ఆలయం చుట్టూ రూ.25 లక్షలతో ప్రహరీ నిర్మాణం, ఆలయ ప్రాంగణంలో రూ. 80 లక్షలతో ఆధునిక వసతులతో కల్యాణ మండపం నిర్మాణం చేపట్టాలని కోరారు. త్వర లో విశాఖ నుంచి పరిపాలన వ్యవహారాలు నిర్వహిస్తామని సీఎం ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

డ్రీమ్ కార్ ఆర్ట్ పోటీల విజేత శృతి


శృతికి ప్రశంసా పత్రం అందిస్తున్న అతుల్ సుద్

బీచ్ రోడ్డు: నగరానికి చెందిన యువ కళాకారిణి శృతి మనోజ్ఞ వేమూరి 16వ గ్లోబల్ టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్ కాంటెస్ట్‌లో విజేతగా నిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో 12–15 ఏళ్ల విభాగంలో ఆమె సత్తా చాటారు. 3 వేల డాలర్ల నగదు బహుమతిని టయోటా వైస్ ప్రెసిడెంట్ అతుల్ సుద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

యువతతోనే దేశాభివృద్ధి


మాట్లాడుతున్న ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ హరనాథ్

మద్దిలపాలెం : యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఆచార్య ఎస్.హరనాథ్ అన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన జాతీయ సేవా పథకం దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సేవా పథకంలో యువతీ, యువకులు పాల్గొనాలన్నారు. పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు పోలా ఉమమహేశ్వరరావు, టి.శ్యామ్యూల్ డేవిడ్ రాజు, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా విభాగానికి ఇద్దరు సబ్ యూనిట్ అధికారులు


సబ్‌యూనిట్ అధికారులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న శేషు, శ్రీనివాసాచారి

మద్దిలపాలెం : జిల్లా మలేరియా విభాగానికి ఇద్దరు సబ్‌యూనిట్ అధికారులను నియమించారు. ఈ మేరకు కొత్తగా వచ్చిన సబ్‌యూనిట్ అధికారులు పి.శేషు, బి.శ్రీనివాసాచారి సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ కట్టడికి చర్యలు చేపట్టడానికి మలేరియా విభాగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. మద్దిలపాలెం సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సబ్‌యూనిట్ అధికారులకు సిబ్బందిని పరిచయం చేశారు.

కాలుష్య నిర్మూలన అందరి బాధ్యత

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- ఆర్టీసీ బస్సులో కార్యాలయానికి..


జీవీఎంసీకి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు కోసం బస్టాప్‌లో వేచి ఉన్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలు విన్నారు. ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో మేయర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు తమ ఉద్యోగులను వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించేలా సూచించాలన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలన్నారు.

వైద్య విధానంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం

ఏయూ క్యాంపస్: వైద్య విధానంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని వైద్య, ఆరోగ్య విభాగం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఉమాసుందరి అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని ప్రభుత్వ ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంకిత భావంతో పని చేస్తూ గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. జీసీడీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఫార్మాసిస్టుల విధులు చాలా లోతైన మూలాలు కలిగి ఉన్నాయన్నారు. పీహెచ్‌సీలలో వారి విధులు మరింత బాధ్యతతో కూడినవిగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫార్మాసిస్టులు మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లా కేడర్‌లో ఉన్న ఫార్మాసిస్టులు జోనల్ కేడర్‌గా రూపాంతరం చెందడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫార్మాసిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పలనాయుడు, ఫార్మాసిస్ట్ రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గం ప్రతినిధులు కోటేశ్వరరావు, బి.ఎస్.నాయుడు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి ఏపీపీఏ అధ్యక్ష, కార్యదర్శులు, పాల్గొన్నారు.

నవ్య ఆలోచనల కోసం అన్వేషణ

- భవిష్యత్ సమస్యలకు యువతే పరిష్కారం చూపాలి
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: యువత నుంచి వచ్చే నవ్య ఆలోచనల కోసం అన్వేషణ జరుగుతోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఏయూ వైఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన హ్యాకథాన్–2023ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్ సమస్యలకు యువతే పరిష్కారాలు చూపాలని సూచించారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా హ్యాకథాన్‌లకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. నేడు కోడింగ్‌లో విధానంలో యంత్రాల ప్రభావం పెరిగిపోతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల్లో ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను పెంపొందించే సమయంలో నూతన విధానాలతో పని చేయాలని సూచించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ఏయూలో నూతనంగా ‘ఏయూ కోడియం’ని ప్రారంభిస్తామని వీసీ ప్రకటించారు. హ్యాకథాన్‌లో పాల్గొనే విద్యార్థులకు మార్గదర్శనం అందించే విధంగా ఇది పని చేస్తుందన్నారు. దీనిలో వర్సిటీ ఆచార్యులను సమన్వయకర్తగా నియమిస్తామని, అదే విధంగా పరిశ్రమల నిపుణులు సలహాదారులుగా ఉంటూ మార్గనిర్దేశం చేస్తారన్నారు. దీనిని పూర్తిస్థాయిలో విద్యార్థులే నిర్వహిస్తారని ప్రకటించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ వైవిధ్య ఆలోచనలతో పని చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు వేదికగా నిలుస్తాయన్నారు. సృజనాత్మకంగా పనిచేస్తూ ఇచ్చిన సమస్యలకు సమాధానాలు అన్వేషించాలన్నారు. పోటీల్లో పాల్గొంటున్న 36 టీంలు కేంద్ర ప్రభుత్వం సూచించిన సమస్యలకు పరిష్కారాలు చూపాలన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు, ఐటీ విభాగాధిపతి ఆచార్య కె.నాగేశ్వరరావు, ఆచార్య కె.రాంజీ, డాక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

సచ్చిదానందమూర్తికి ఘన నివాళి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వకళాపరిషత్ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ ఆచార్య కె.సచ్చిదానందమూర్తి శత జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సచ్చిదానందమూర్తి విగ్రహానికి రిజిస్ట్రార్ ఆచార్య వి.కష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్యులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశానికి పిలాసఫీ - రెలిజియస్ స్టడీస్ శాఖాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు అధ్యక్షత వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఆదర్శాల అధ్యయనమే తత్వశాస్త్రమని, భారతదేశ తత్వదర్శనాన్ని ప్రపంచానికి తెలియజేసిన గొప్ప దార్శనికుడు సచ్చిదానందమూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ మాజీ వీసీ ఆచార్య పి.జార్జి విక్టర్, సీనియర్ ఆచార్యులు ఎం.వి.కృష్ణయ్య, ఐసీపీఆర్ సీనియర్ ఫెలో ఆచార్య కె.ఆర్.రజని, బీవోఎస్ చైర్మన్ డాక్టర్ బూసి వెంకటస్వామి, యోగాచార్యులు ఆచార్య కె.రమేష్ బాబు, ఆచార్య బి.రవిబాబు, ఆచార్య జి.వీర్రాజు, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్సవ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆయన సోమవారం ఉదయం ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆంధ్రా యూనివర్సిటీ, ఆయుష్మాన్ హార్ట్ సెంటర్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని వీసీ తెలిపారు. అంబేడ్కర్ చైర్ కార్యాలయంలో ఆచార్యులకు ఈసీజీ, ఎకో, బ్లడ్ షుగర్, బీపీ, స్పెషలిస్ట్ వైద్యులతో కన్సల్టేషన్ వంటివి ఈ ఆరోగ్య శిబిరంలో ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ గరికపాటి మహేష్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం జరగనుంది. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు 30 వరకూ ఫీజు గడువు

మద్దిలపాలెం : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్న ప్రైవేట్ అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పరీక్ష తప్పిన విద్యార్థులు ఫీజు చెల్లించి, కళాశాలలో తరగతులకు హాజరుకావడానికి ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రైవేట్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాల సమయంలో విద్యార్థులు సంప్రదించాలన్నారు.

ఘనంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి


దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాల తదితరులు

ఎంవీపీ కాలనీ: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలన సాగిందని కేంద్ర మత్స్యకార శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల అన్నారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన సోమవారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత దీన్‌దాయళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్లుగా దేశాభివృద్ధి శరవేగంగా జరిగిందన్నారు. అన్ని రంగాల్లోను ప్రపంచ దేశాలకు దీటుగా ప్రధాని మోదీ భారత్‌ను నిలిపారన్నారు. దీన్ దయాళ్ సిద్ధాంతమైన ఏకాత్మ మానవతావాదమే లక్ష్యంగా దేశాన్ని మోదీ పరిపాలిస్తున్నారన్నారు. ఈ ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథ్, ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు.

గణపతి సన్నిధిలో అన్నసమారాధనలు


అన్నదానం చేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణమోహన్ తదితరులు


అన్నసమారాధనలో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ, తదితరులు


15వ వార్డులో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరావు

ఎంవీపీ కాలనీ: గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అన్నసమారాధనలు, కుంకుమ పూజలతో మండపాలు కళకళలాడుతున్నాయి. 18వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్-9లో సోమ వారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులకు వడ్డించారు. ముందుగా శ్రీవరసిద్ధి వినాయకుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ప్రకటించిన విధంగా త్వరలోనే విశాఖ రాజధానిగా పాలన సాగించనున్నారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందడుగు వేయాలంటే సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. ఈ దిశగా ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్‌లో నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు ప్రారంభించారు. భక్తులకు ఆయన స్వయంగా వడ్డించారు.

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ స్వయంగా విద్యార్థులకు, ఉద్యోగులకు ఆహార పదార్థాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఏయూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మహమ్మద్ ఖాన్, ఉద్యోగుల సంఘం నాయకులు డాక్టర్ జి.రవికుమార్, పలువురు ఆచార్యులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ క్యాంపస్: స్థానిక పెదవాల్తేరు రైతుబజార్‌లో రైతులు, స్టాల్స్ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలో కృష్ణా యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 5 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. పీతవానిపాలెం, శివాజీపాలెం, పిఠాపురం కాలనీ, మంగాపురం కాలనీ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎస్ఐ కుమార్

ఆరిలోవ: ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ వెంకటకుమార్ అన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవ గాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు దాటుతున్నప్పు డు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, ఏ సమయంలో రోడ్డు దాటాలి, వాహనాలు నడుపుతున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. తదితర వాటి గురించి వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.